సాక్షి చిత్తూరు

గురువారం । 29 । ఆగస్టు । 2024



ప్రణాళిక ప్రకారం..

ప్రణాళిక ప్రకారం సమస్యల పరిష్కారానికి కృషి చేయనున్నట్లు నూతన జాయింట్ కలెక్టర్ విద్యాధరి తెలిపారు.

- 8లో



పట్టుబడిన మద్యం ధ్వంసం

కార్వేటినగరంలో అక్రమంగా తరలిస్తూ పట్టుబడిన మద్యం సీసాలను పోలీసులు జేసీబీతో ధ్వంసం చేశారు.

- 8లో



ఆర్‌ఎంపీలు మాయం

జిల్లాలో అధికారులు దాడులు చేస్తారన్న సమాచారంతో పలుచోట్ల ఆర్‌ఎంపీలు కనిపించకుండాపోయారు.

- 8లో

న్యూస్‌రీల్

31 నుంచి స్వచ్ఛతా పక్వాడా



ఏపీసీ వెంకటరమణారెడ్డి

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఈ నెల 31వ తేదీ నుంచి సెప్టెంబర్ 15వ తేదీ వరకు స్వచ్ఛతా పక్వాడా కార్యక్రమం నిర్వహించాలని జిల్లా సమగ్రశిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ వెంకటరమణారెడ్డి అన్నారు. ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడుతూ సంబంధిత షెడ్యూల్ ప్రకారం స్వచ్ఛతా పక్వాడా కార్యక్రమాలను పకడ్బందీగా నిర్వహించాలన్నారు. ఈ నెల 31న స్వచ్ఛతా పక్వాడా ప్రతిజ్ఞ, అవగాహన, సెప్టెంబర్ 2 నుంచి తల్లిదండ్రుల సమావేశం, పరిసరాల శుభ్రత, పారిశుద్ధ్యం, చేతుల శుభ్రత పట్ల అవగాహన, సెప్టెంబర్ 3న పారిశుద్ధ్యం కోసం చేపట్టాల్సిన జాగ్రత్తలను స్థానిక ప్రజాప్రతినిధులతో సమావేశం, సెప్టెంబర్ 4న ఉపాధ్యాయులందరూ సమీపంలో గ్రామాలను సందర్శించి స్వచ్ఛతపై స్థానిక కమ్యూనిటీలను సంప్రదించడం, మరుగుదొడ్ల వినియోగం, సెప్టెంబర్ 6న నీటి సంరక్షణ సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ని నిర్మూలించడం, పాఠశాలల్లో ప్రదర్శనలు, సెప్టెంబర్ 7, 8 తేదీల్లో పాఠశాలల్లో పరిశుభ్రమైన ప్రాంగణాలు అంశంపై జిల్లా, మండలం, పాఠశాల స్థాయిలో పోటీలు, స్వచ్ఛత అంశంపై వ్యాసం, నినాదం, వ్యక్తృత్వ, క్విజ్, పెయింటింగ్, సెప్టెంబర్ 9,10 తేదీల్లో రోజువారీ జీవితంలో సరైన చేతుల శుభ్రతపై అవగాహన, తినడానికి ముందు, తర్వాత చేతులను సబ్బుతో శుభ్రం చేసుకునే విధానాన్ని పిల్లలకు నేర్పించడం, సెప్టెంబర్ 11న వ్యక్తిగత పరిశుభ్రత, సెప్టెంబర్ 12న స్వచ్ఛతా పక్వాడా ఎగ్జిబిషన్, సెప్టెంబర్ 13, 14 తేదీల్లో స్వచ్ఛత భవిష్యత్ ప్రణాళికలు, ఫొటోలు అప్‌లోడ్ చేయడం, సెప్టెంబర్ 15న విద్యార్థులకు బహుమతి ప్రదానం నిర్వహించాలని ఏపీసీ కోరారు.

మద్యం దుకాణాల ఉద్యోగులు ఎక్కడికక్కడ అరెస్టు

చిత్తూరు అర్బన్: విజయవాడలో గురువారం తలపెట్టిన నిరసన కార్యక్రమానికి వెళుతున్న చిత్తూరు, తిరుపతి జిల్లాలోని ప్రభుత్వ మద్యం దుకాణాల్లో పనిచేస్తున్న పలువురు ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను పోలీసులు ఎక్కడికక్కడ అదుపులోకి తీసుకున్నారు. రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రభుత్వ మద్యం దుకాణాల స్థానంలో ప్రైవేటు దుకాణాలను తీసుకురావాలని నిర్ణయించింది. ఈ నేపథ్యంలో అక్టోబర్ నుంచి నూతన మద్యం పాలసీని విడుదల చేయనుంది. అయితే ఇప్పటికే రెండు జిల్లాల్లో పనిచేస్తున్న వెయ్యి మంది ఉద్యోగుల కుటుంబాలు ఉద్యోగ భద్రత దొరక్క రోడ్డున పడే పరిస్థితి నెలకొంది. దీనికి తోడు గత రెండు నెలలుగా మద్యం దుకాణాల్లో పనిచేసే ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు వేతనాలు ఇవ్వకుండా ప్రభుత్వం వేధింపులకు గురిచేస్తోంది. కూటమి ప్రభుత్వ విధివిధానాలను నిరసిస్తూ చిత్తూరు, తిరుపతి జిల్లాల్లోని పలువురు ఉద్యోగులు గురువారం చలో విజయవాడకు పిలుపునిచ్చారు. ఈ నిరసన కార్యక్రమం తెలియజేయడానికి ఉద్యోగులంతా విజయవాడకు బయలుదేరగా పలువురిని నాయుడుపేటలో మరి కొంతమందిని విజయవాడ, చంద్రగిరి ప్రాంతాల్లో పోలీసులు అడ్డుకుని అదుపులోకి తీసుకున్నారు. ప్రభుత్వ నిర్ణయం పోలీసులపై ఉద్యోగులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు.

గౌరవం నేర్పాలి



పురుషులతో పోటీపడి ప్రతి రంగంలో మహిళలు రాణిస్తున్నారు. నిరంతరం రకరకాల మనస్తత్వం ఉన్న వారికి సేవలందించే మహిళా వైద్యులకు పనిచేసే చోట తగిన భద్రత కల్పించాలి. ఈ ఆవశ్యకతను కోల్‌కతా ఘటన సూచిస్తోంది. ఇటువంటి దారుణాలు జరగకుండా ఉండాలంటే కుటుంబంలోని తల్లీ, చెల్లిని గౌరవించినట్లే బయట మహిళలను కూడా గౌరవించేలా పిల్లలకు నేర్పాలి. స్త్రీ, పురుషులు పరస్పరం గౌరవించుకుంటే ఇలాంటి సంఘటనలకు తావుండదు.

– మోనిక , జూనియర్ డాక్టర్, చిత్తూరు



మహిళలకు భరోసా కల్పించాలి



ఆధునిక యుగంలో పురుషులతో సమానంగా మహిళలు రాణించాలని ప్రభుత్వాలు చర్యలు చేపడుతున్నాయి. క్షేత్రస్థాయిలో కూడా భద్రత దిశగా చర్యలు చేపట్టాలి. నేరాలకు పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించి మహిళలకు భరోసా కల్పించాలి. ఎంతో భవిష్యత్తు ఉన్న కోల్‌కతా డాక్టర్ దారుణంగా ప్రాణాలు కోల్పోవడం అత్యంత బాధాకరం. ప్రభుత్వాలు ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలి.

– హరినాథ్, జూనియర్ డాక్టర్, చిత్తూరు

క్రీడా కుసుమాలు



రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ పోటీల్లో సిల్వర్ మెడల్ సాధించిన భవిత

- ఐరాల బడిలో మెరిసిన మాణిక్యాలు
- పతకాలు సాధించిన విద్యార్థులు
- జాతీయ స్థాయికి క్రీడాకారులు
- ఉన్నత లక్ష్యంగా ముందడుగు

వారందరూ గ్రామీణ ప్రాంతానికి చెందిన వారు. నిరుపేద కుటుంబాల నుంచి వచ్చారు. దాతల సహకారం తీసుకున్నారు. అందుబాటులో ఉన్న వసతులను వినియోగించుకున్నారు. సర్కారు బడిలోనే శిక్షణ పొందారు. క్రీడల్లో రాణించి, మట్టిల్లో మెరిసిన మాణిక్యాలయ్యారు. జాతీయ స్థాయి పోటీల్లో పతకాలు సాధించారు. గ్రామానికి, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకొచ్చారు. మరింతగా రాణించేందుకు ప్రణాళిక రూపొందించుకుని ముందుకెళుతున్నారు. వారందరూ ఐరాల ప్రభుత్వ బడిలో చదివిన విద్యార్థులే. ఈ పాఠశాలకు క్రీడా ప్రతిభ అవార్డు వచ్చిన సందర్భంగా క్రీడాకారుల ప్రస్థానంపై ప్రత్యేక కథనం.

ఐరాల: మారుమూల గ్రామాల నుంచి జాతీయ స్థాయికి ఎదిగారు. వీరందరూ ఐరాల ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు. సర్కారు బడిలో చదువుతూ సాఫ్ట్‌బాల్, ఫెన్సింగ్, బేస్‌బాల్ సాధన చేస్తున్నారు. పీడీ దేవానంద శిక్షణలో రాటుదేలి జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో సత్తా చాటుతున్నారు. వీరికి కొద్దిగా ప్రోత్సాహకం, భరోసా, కల్పిస్తే జాతీయస్థాయిలో రాణించే సత్తా ఉన్నవారు. అరకొర వసతులతో సాధన మొదలు పెట్టిన క్రీడాకారులకు క్రమంగా దాతల నుంచి సహకారం అందుతూ వచ్చింది. అదే పాఠశాల పూర్వ విద్యార్థి, సాఫ్ట్‌బాల్ క్రీడాకారుడైన ఐల గోపాల్‌రెడ్డి(రిటైర్డ్ ఎయిర్ ఫోర్స్), ఆయన కుమారుడు ఐల రాజశేఖర్‌రెడ్డి(అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి) వారి ట్రస్టు ద్వారా సుమారు రూ.లక్షకు పైగా విలువచేసే క్రీడాపరికరాలను అందించారు. దాత ప్రోత్సాహంతో పాఠశాల పీడీ సాఫ్ట్‌బాల్, బేస్‌బాల్, ఫెన్సింగ్ క్రీడల్లో కఠోరసాధన చేయించారు. క్రీడాకారులు ఇప్పటికే పలు టోర్నీల్లో విజేతలుగా నిలిచి పతకాలు సాధించారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రానించడానికి శ్రమిస్తున్నారు. క్రీడాకారుల నైపుణ్యానికి ఇంకొంత ఆర్థికంగా, క్రీడా పరికరాలు, సంతులిత ఆహారాన్ని దాతలు అందించగలిగితే అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించే అవకాశం ఉంది.

పతకాల భవిత

నాగంవాండ్లపల్లెకు చెందిన భవిత తండ్రి బాలక్రిష్ణ (ఆటోడ్రైవర్), తల్లి సునీత (ఏఎన్‌ఎం). చిన్నతనం నుంచే క్రీడలపై ఆసక్తితో భవిత మూడేళ్లుగా సాఫ్ట్‌బాల్, బేస్‌బాల్, ఫెన్సింగ్‌లో శిక్షణ తీసుకుంటోంది. గత ఏడాది నంద్యాలలో నిర్వహించిన రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ పోటీల్లో వ్యక్తిగత విభాగంలో రజత పతకాన్ని, గ్రూప్ విభాగంలో కాంస్య పతకాన్ని సాధించింది. గత సంవత్సరం ఛత్తీస్‌గఢ్‌లో నిర్వహించిన జాతీయస్థాయి ఫెన్సింగ్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచింది. సాఫ్ట్‌బాల్, బేస్‌బాల్ రాష్ట్ర స్థాయి టోర్నమెంట్‌లలో పాల్గొని మంచి ప్రతిభ కనబరిచింది.

చాంపియన్ వేణుగోపాల్



యదర్లపల్లెకు చెందిన టి.వేణుగోపాల్‌కు తండ్రి లేడు. తల్లి చిన్నమ్మ టైలర్. కుట్టుపని చేసి కుటుంబాన్ని పోషిస్తోంది. బేస్‌బాల్, సాఫ్ట్‌బాల్ క్రీడలపై ఉన్న ఆసక్తి అతడిని ఉత్తమ క్రీడాకారుడిగా నిలిపింది. మధ్యప్రదేశ్‌లో జరిగిన 65వ జాతీయస్థాయి బేస్‌బాల్ పోటీల్లో పాల్గొన్నాడు. పంజాబ్ రాష్ట్రంలో జరిగిన జాతీయస్థాయి జూనియర్ సాఫ్ట్‌బాల్ పోటీల్లో పాల్గొని బంగారు పతకం సాధించడంతో పాటు ఆంధ్రప్రదేశ్ జట్టు ప్రథమ స్థానం సాధించడంలో కీలక పాత్ర పోషించాడు. అంతేకాకుండా పలు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని మంచి ప్రతిభ కనబరిచాడు.

స్వర్ణం సాధించిన వంశీ



35 యర్లంపల్లెకు చెందిన వంశీకృష్ణ తండ్రి రమణారెడ్డి (ప్లంబర్), తల్లి రోజా. సాఫ్ట్‌బాల్‌పై ఆసక్తితో వంశీకృష్ణ పాఠశాలలో శిక్షణ తీసుకుంటున్నాడు. గత సంవత్సరం బిహార్‌లోని పాట్నాలో నిర్వహించిన జాతీయ స్థాయి జూనియర్ సాఫ్ట్‌బాల్ పోటీల్లో కాంస్య పతకాన్ని సాధించాడు. మహారాష్ట్ర పూణేలో నిర్వహించిన సబ్‌జూనియర్ సాఫ్ట్‌బాల్ పోటీల్లో బంగారు పతకాన్ని సాధించాడు. అంతర్జాతీయస్థాయిలో రాణించేందుకు ప్రణాళికాబద్ధంగా శిక్షణ తీసుకుంటున్నాడు.

సాఫ్ట్‌బాల్ విజేత శివ



వి.యస్.అగ్రహారానికి చెందిన శివ తండ్రి బాబు, తల్లి పుష్ప వ్యవసాయ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. శివ సాఫ్ట్‌బాల్ మీద ఉన్న ఆసక్తితో శిక్షణ పొందాడు. హిమాచల్‌ప్రదేశ్‌లో జరిగిన అండర్–12 సబ్ జూనియర్ సాఫ్ట్‌బాల్ జాతీయస్థాయి పోటీల్లో బంగారు పతకం సాధించాడు. భువనేశ్వర్‌లో నిర్వహించిన 33వ సబ్ జూనియర్ పోటీల్లో పాల్గొన్నాడు. పంజాబ్‌లో నిర్వహించిన జూనియర్ సాఫ్ట్‌బాల్ చాంపియన్‌షిప్‌లో మంచి నైపుణ్యాన్ని కనబరిచాడు. అంతేకాకుండా తిరుపతి, మచిలీపట్నం, శ్రీకాకుళం, అనంతపురం జిల్లాలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొన్నాడు.

కప్ కొట్టిన చందన



నయనంపల్లెకు చెందిన చందన తండ్రి వరదరాజులు (ఆటోడ్రైవర్), తల్లి యాగలక్ష్మి (కూలీ). కుమార్తెకు క్రీడల పట్ల ఆసక్తి గమనించిన తల్లిదండ్రులు ప్రోత్సాహించారు. గుజరాత్‌లో జరిగిన 34వ సబ్ జూనియర్ సాఫ్ట్‌బాల్ జాతీయ స్థాయి పోటీల్లో ఆంధ్రప్రదేశ్ జట్టు తరపున పాల్గొని జట్టు రెండవ స్థానం సాధించడంలో కీలకపాత్ర పోషించింది. జాతీయ స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో కప్ సాధించింది. మధ్యప్రదేశ్‌లో నిర్వహించిన అండర్–14 జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంది. పలు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంది. ఇంకా జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీల్లో సత్తా చాటడానికి శిక్షణ తీసుకుంటోంది.

సౌత్ జోన్ విజేత భూమిక



నయనంపల్లెకు చెందిన భూమిక తండ్రి చెంగల్‌రాయులు(రైతు), తల్లి రెడ్డెమ్మ వ్యవసాయ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. క్రీడలపై ఉన్న ఆసక్తితో ఆరేళ్లుగా భూమిక సాఫ్ట్‌బాల్ క్రీడలో శిక్షణ తీసుకుంటోంది. పశ్చిమగోదావరి జిల్లాలో నిర్వహించిన అండర్–19 రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో మూడవ స్థానం సాధించింది. శ్రీకాకుళంలో నిర్వహించిన 9వ రాష్ట్రస్థాయి సీనియర్ ఇంటర్ డిస్ట్రిక్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొని జాతీయస్థాయికి ఎంపికైంది. తిరుపతి, మచిలీపట్నం, అనంతపురం, పశ్చిమగోదావరి జిల్లాలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీల్లో సత్తాచాటింది. సౌత్ జోన్ సాఫ్ట్‌బాల్ పోటీల్లో కప్ సాధించింది.

కాంస్యంతో యువశ్రీ



రెడ్డివారిపల్లెకు చెందిన యువశ్రీ తండ్రి జగదీశ్వర్‌రెడ్డి(జేసీబీ డ్రైవర్), తల్లి సునీత వ్యవసాయ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. యువశ్రీ క్రీడలపై ఆసక్తితో సాఫ్ట్‌బాల్‌లో శిక్షణ పొందుతోంది. రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో పలుమార్లు జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహించింది. అండర్–14 రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్, ఫెన్సింగ్ పోటీల్లో క్యాంసం పతకాన్ని సాధించింది. సాఫ్ట్‌బాల్‌లో బాగా శిక్షణ పొంది జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని బంగారు పతకం సాధించడమే లక్ష్యంగా ముందుకెళుతోంది.

రోహిత్.. బంగారం



ఐలవారిపల్లెకు చెందిన రోహిత్ తండ్రి ధనంజయాచారి (కార్పెంటర్), తల్లి పుష్ప. రోహిత్ 10వ తరగతి చదువుతున్నాడు. ఆరో తరగతి నుంచి క్రీడలపై మక్కువతో సాఫ్ట్‌బాల్, బేస్‌బాల్, ఫెన్సింగ్‌లో శిక్షణ పొందుతున్నాడు. గత ఏడాది నంద్యాలలో నిర్వహించిన ఫెన్సింగ్ పోటీల్లో బంగారు పతకం సాధించాడు. రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన సాఫ్ట్‌బాల్, బేస్‌బాల్ టోర్నమెంట్లలో పాల్గొని జిల్లాకు, పాఠశాలకు మంచి పేరు ప్రఖ్యాతులు తీసుకొచ్చాడు. క్రీడల్లో రాణించి ఆర్మీలో ఉద్యోగం సాధించి దేశానికి సేవ చేయాలనుకుంటున్నాడు.

ఉద్యోగులకు సర్కారు ఎసరు

- ప్రైవేటు మద్యం దుకాణాలతో ఉద్యోగాలు పోయినట్టే
- ఇప్పటికే వలంటీర్లు, స్కూళ్లల్లో సిబ్బందికి జీతాల్లేవు
- ఇపుడు మద్యం దుకాణాల్లోని ఉద్యోగుల వంతు
- అవుట్ సోర్సింగ్ వాళ్లకు ఉద్యోగ భద్రత కరువు



ప్రభుత్వ మద్యం దుకాణంలో విధులు నిర్వర్తిస్తున్న సిబ్బంది (ఫైల్)

చిత్తూరు అర్బన్: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గత ప్రభుత్వంలో కొత్తగా ఉద్యోగాలు పొందిన వారికి ఎసరు పెడుతోంది. దీంతో ఉద్యోగుల్లో అభద్రతా భావం నెలకొంది. ఇప్పటికే వలంటీర్లకు వేతనాలు ఇవ్వకుండా కక్షసాధింపు చర్యలు చేస్తున్న ప్రభుత్వం.. పాఠశాలల్లోని పారిశుద్ధ్య కార్మికులు, ఆయాలకు మూడు నెలలుగా వేతనాలు ఇవ్వకుండా వేధిస్తోంది. తాజాగా ప్రభుత్వ మద్యం దుకాణాల్లో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు రెండు నెలలుగా వేతనాలు అందలేదు. పైగా వచ్చే నెలాఖరుతో ప్రభుత్వ మద్యం దుకాణాల స్థానంలో ప్రైవేటు మద్యం దుకాణాలు రానుండడంతో జిల్లాలోని దాదాపు 500 మంది ఉద్యోగులు ఉపాధి కోల్పోయి రోడ్డున పడనున్నారు.

ఆ కుటుంబాలకు దిక్కేది?

2019వ సంవత్సరం ముందు వరకు నాటి టీడీపీ ప్రభుత్వం మద్యాన్ని ఓ ఆదాయ వనరుగా మాత్రమే చూసింది. టీడీపీ నేతలకు ఉపాధి కల్పించడం, రూ.వేల కోట్ల ఆర్జించడమే లక్ష్యంగా మద్యం దుకాణాలకు లైసెన్సులు జారీ చేసింది. అటు తరువాత వచ్చిన వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రైవేటు దుకాణాల దందాకు కళ్లెంవేసి, వాటి స్థానంలో ప్రభుత్వ మద్యం దుకాణాలను తీసుకొచ్చింది. ఎమ్మార్పీ ధరలకు మద్యం అందిస్తూ, ప్రభుత్వ మద్యం దుకాణాల్లో నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించింది. ఒక్కో మద్యం దుకాణంలో ఓ సూపర్‌వైజర్‌తో పాటు ముగ్గురు సేల్స్‌మెన్లు, ఓ వాచ్‌మెన్ (కొన్ని చోట్ల ఇద్దరు) చొప్పున నిరుద్యోగులకు అవకాశాలు కల్పించింది. వీరిలో సూపర్‌వైజర్లకు నెలకు రూ.19,500, సేల్స్‌మెన్లకు రూ.16,500, వాచ్‌మెన్‌కు రూ.12వేలు చొప్పున వేతనాలు ఇస్తూ వచ్చింది. ఇలా జిల్లాలోని 110 మద్యం దుకాణాల్లో దాదాపు 500 కుటుంబాలకు ఉపాధి లభించింది. తాజాగా అక్టోబర్ 1వ తేదీ నుంచి కొత్త మద్యం పాలసీ తీసుకొస్తూ, ఇప్పటికే నడుస్తున్న ప్రభుత్వ మద్యం దుకాణాలకు మూసేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించడంతో ఈ 500 కుటుంబాలు రోడ్డున పడ్డట్టయ్యింది.

సర్దుబాటు చేయొచ్చు

ప్రభుత్వం మారినపుడల్లా ఉద్యోగులపై ఓ పార్టీ ముద్రవేసి వేధింపులకు దిగడం టీడీపీ నాయకులకు అలవాటుగా మారిపోయింది. డిగ్రీలు, పీజీలు చేసి పొట్టకూటి కోసం ఏదో ఒక పనిచేసుకుంటున్న నిరుద్యోగుల పొట్టకొట్టడంపై సామాన్యులు సైతం ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మద్యం దుకాణాలు ప్రైవేటు పరం చేయడం ప్రభుత్వ నిర్ణయానికి వదిలేసినా.. ఇక్కడ పనిచేస్తున్న వందలాది మంది నిరుద్యోగులకు ఉద్యోగ భద్రత ఇవ్వాలని అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు కోరుతున్నారు. దీనిపై ప్రభుత్వ పెద్దలు సానుకూలంగా నిర్ణయం తీసుకోవాలని వేడుకుంటున్నారు.

ఏదో ఓచోట ఉద్యోగం ఇవ్వండి



మద్యం దుకాణాల్లో పనిచేసే మేము చాలా చిన్న ఉద్యోగులం. మాకు రాజకీయ పార్టీలతో ఏమాత్రం సంబంధంలేదు. వచ్చే జీతంతో కుటుంబాన్ని పోషించుకుంటున్నాం. కొత్త పాలసీను అమలు చేస్తే మాకు ఎలాంటి అభ్యంతరంలేదు. కానీ మమ్మల్ని రోడ్డున పడేయకుండా ఏదో ఓచోట సర్దుబాటు చేయమని కోరుకుంటున్నాం.

– చక్రవర్తి, మద్యం దుకాణ ఉద్యోగి, చిత్తూరు

వేతనాలు రాలేదు..



గత రెండు నెలలుగా మద్యం దుకాణాల్లో పనిచేసే మాకు ఎవ్వరికీ వేతనాలు ఇవ్వలేదు. ఇంటికి సరుకులు తీసుకెళ్లాలన్నా కూడా ఇబ్బందిగా ఉంది. జీతాలు ఇవ్వడంతో పాటు మమ్మల్ని ఏదో ఒక డిపార్టుమెంటులో పెట్టండి. మా పొట్ట కొట్టొద్దని వేడుకుంటున్నాం. మా కుటుంబాలు పోషించుకునే స్థోమత మాకు కల్పించండి.

– దానియల్, మద్యం దుకాణం సేల్స్‌మెన్, ఎస్.ఆర్.పేట, చిత్తూరు

వేతనాలు ఇచ్చేస్తాం..

ఉద్యోగులకు వేతనాలు ఇవ్వడంలో చిన్నపాటి సాంకేతిక ఇబ్బంది తలెత్తింది. ఏజెన్సీ వివరాలు నమోదు చేయడంలో వచ్చిన సమస్య కారణంగా వేతనాలు అందలేదు. రెండు రోజుల్లో వేతనాలు ఇచ్చేస్తాం. అయితే ఉద్యోగ భద్రత అనేది మా పరిధిలోని అంశం కాదు. దీనిపై ప్రభుత్వ ఆదేశాలను మేము అమలు చేస్తాం అంతే.

– అయేషాబేగం, మద్యం డిపో మేనేజరు, చిత్తూరు

క్లుప్తంగా

బస్సు ప్రయాణికులను దోచే మహిళల అరెస్టు

పలమనేరు: బస్సులో తోటి ప్రయాణికులతో కలుపుగోలుగా ఉంటూ మాయమాటల్లో దింపి వారిని ఏమార్చే మహిళా దొంగలను పలమనేరు పోలీసులు బుధవారం చాకచక్యంగా పట్టుకున్నారు. పోలీసుల కథనం మేరకు, ఉమాదేవి మంగళవారం తిరుపతి నుంచి బెంగళూరుకు బస్సులో బయలుదేరింది. బంగారుపాళెంలో బస్సెక్కిన ఇద్దరు మహిళలు ఆమె పక్కనే కూర్చున్నారు. ఆమెతో మాట్లాడుతూ ఆమె హ్యాండ్‌బ్యాగులోని పర్సుని చోరీ చేశారు. ఆపై వారు పలమనేరులో దిగి వెళ్లిపోయారు. అయితే పర్సును పరిశీలించిన ఆమె అందులోని బంగారు ఆభరణాలు చోరీ అయినట్లు గుర్తించి, బాధితురాలు పలమనేరు పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీనిపై సాంకేతికంగా దర్యాప్తు చేసిన పోలీసులు నిందితులను చిత్తూరులో అరెస్ట్ చేసి ఇక్కడికి తీసుకొచ్చారు. ఈ చోరీకి కారణమైన మంగసముద్రానికి చెందిన శ్రావణి, లక్ష్మీని అరెస్ట్ చేసి వారి నుంచి 30 గ్రాముల బంగారు ఆభరణాలు, వజ్రపు కమ్మలు మొత్తం రూ.4.50 లక్షలు విలువైన వాటిని స్వాధీనం చేసుకొని నిందితులపై కేసు నమోదు చేసినట్టు పలమనేరు పోలీసులు తెలిపారు.

నేడు కుప్పంలో గ్రీవెన్స్

చిత్తూరు కలెక్టరేట్ : కుప్పంలో ఈ నెల 29న ప్రజా సమస్యల పరిష్కార వేదిక (గ్రీవెన్స్) కార్యక్రమం నిర్వహించనున్నట్లు కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ తెలిపారు. ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడుతూ కుప్పంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు కార్యక్రమం నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో కుప్పం నియోజకవర్గంలోని ప్రజలు తమ సమస్యల వినతులను అందజేసి పరిష్కరించుకోవాలన్నారు.

31న ఉద్యోగ మేళా

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా కేంద్రంలోని పుత్తూరు రోడ్డులో ఉన్న ఉపాధి కార్యాలయంలో ఈ నెల 31న ఉద్యోగ మేళా నిర్వహించనున్నట్లు ఆ శాఖ అధికారి పద్మజ తెలిపారు. ఈ మేరకు ఆమె బుధవారం విలేకరులతో మాట్లాడుతూ 31వ తేదీ ఉదయం నిర్వహించే ఉద్యోగ మేళాలో టయోటా, హోండా కంపెనీలు పాల్గొంటాయన్నారు. ఐటీఐ, డిప్లమో, ఏదైనా డిగ్రీ పూర్తి చేసిన అభ్యర్థులు సంబంధిత సర్టిఫికెట్లతో హాజరుకావాలని కోరారు. ఇతర వివరాలకు 9704731410ను సంప్రదించాలని ఆమె కోరారు.

రేపు బదిలీల కౌన్సెలింగ్

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా ఉన్న గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగులకు ఈ నెల 30న బదిలీల కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ వెల్లడించారు. ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడుతూ ఉద్యోగుల బదిలీలను పకడ్బందీగా నిర్వహించేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. సంబంధిత శాఖల అధికారుల సమక్షంలో కౌన్సెలింగ్ ఉంటుందని వెల్లడించారు. బదిలీలకు దరఖాస్తు చేసుకున్న వారు ఆయా శాఖల జిల్లా కార్యాలయంలో హాజరుకావాలని కలెక్టర్ ఆదేశించారు.

కాపాడే బాధ్యత ప్రభుత్వానిదే



కోల్‌కతా ఘటన హేయమైన చర్య. జిల్లా ఆస్పత్రుల్లో భద్రతతో పాటు మండలాల్లో ఉండే ఆస్పత్రుల్లో కూడా రక్షణ చర్యలు తీసుకురావాలి. రాత్రి వేళ వైద్యులు, ఇతర సిబ్బంది విధుల్లో ఉంటున్నారు. చికిత్స అవసరం లేని వారు, మద్యం మత్తులో ఉన్న వ్యక్తులు ఆలోచనా శక్తి కోల్పోయి ఏదో చేయాలని ఆస్పత్రిలోకి చొరబడుతుంటారు. కోల్‌కతా వంటి దారుణ ఘటనలు ఎక్కడా జరగకుండా ఆస్పత్రి వ్యవస్థలో మార్పులు రావాలి. దీనికి పూర్తి బాధ్యత ప్రభుత్వం తీసుకోవాలి.

– షబీనా, జూనియర్ డాక్టర్, చిత్తూరు



భద్రత ముఖ్యం



కోల్‌కతాలో జరిగిన జూనియర్ డాక్టర్ హత్య అత్యంత దారుణం. ఈ హత్యను తప్పుదారి పట్టించాలి చూశారు. కానీ ఏదో రకంగా వైద్యురాలి ఘోష బయటపడింది. ఇప్పటికి కూడా దీనిని జీర్ణించుకోలేకపోతున్నాం. పనిచేసే చోట పురుషులు చాలా సందర్భాల్లో సర్దుకుపోతుంటారు. కానీ మహిళా వైద్యులు సున్నిత మనస్కులు. కచ్చితంగా వారికి భద్రత అనేది తప్పనిసరిగా ఉండాలి. ఏ ఒక అవసరానికి కూడా బయటకు వెళ్లకుండా ఆస్పత్రి ఆవరణలోనే సదుపాయాలు, వసతులు కల్పించాలి.

– రాబిన్, జూనియర్ డాక్టర్, చిత్తూరు

రైతులకు బిందు సేద్య పరికరాలు





సమావేశంలో మాట్లాడుతున్న చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, సమావేశంలో పాల్గొన్న అధికారులు, కమిటీ సభ్యులు

- ఎస్సీ, ఎస్టీల సమస్యలు సకాలంలో పరిష్కరించాలి
- ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ
- కలెక్టరేట్‌లో నిఘా, పర్యవేక్షణ కమిటీ సమావేశం

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా రైతులకు బిందు సేద్య పరికరాలను అందజేయనున్నట్లు చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ తెలిపారు. కలెక్టరేట్‌లో బుధవారం జిల్లా స్థాయి నిఘా, పర్యవేక్షణ కమిటీ సమావేశం నిర్వహించారు. ఎంపీ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ వర్గాల అభివృద్ధికి కేంద్ర నిధులు తీసుకొచ్చేందుకు ప్రయత్నం చేస్తానన్నారు. 2024–25 సంవత్సరానికి పార్లమెంట్ ఎస్సీ, ఎస్టీ సంక్షేమ కమిటీలో తనకు మెంబర్‌గా అవకాశం ఇచ్చారన్నారు. ఎస్సీ ఎస్టీ సంఘాల నాయకులు కాలనీల్లోని వర్గాలు ఆర్థికంగా అభివృద్ధికి చేపట్టాల్సిన అంశాలపై వివరాలు అందజేయాలన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో బిందు తుంపర్ల సేద్య పరికరాలను రైతులకు అందజేయనున్నట్లు తెలిపారు. జిల్లాకు 21 వేల హెక్టార్లలో బిందు తుంపర్ల సేద్యం సాగు చేయాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామన్నారు. ఎస్సీ, ఎస్టీ రైతులు బిందు సేద్య పరికరాలను పొందేందుకు ఆసక్తి చూపించాలని తెలిపారు. 90 శాతం రాయితీతో పరికరాలను అందజేస్తామన్నారు. ఇప్పటి వరకు జిల్లాలో 10 వేల హెక్టార్లకు సంబంధించి రైతులు రిజిస్ట్రేషన్ చేసుకున్నారన్నారు. ఎస్సీ, ఎస్టీ రైతులు తక్కువగా రిజిస్ట్రేషన్‌లు చేసుకున్నట్లు తెలిపారు. అధికారులు క్షేత్రస్థాయిలో ఎస్సీ, ఎస్టీ రైతులకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. డివిజన్, మండల స్థాయిలో ఖచ్చితంగా నిఘా, పర్యవేక్షణ కమిటీలు నిర్వహించాలన్నారు.

చిత్తశుద్ధితో సమస్యలు పరిష్కరించాలి

క్షేత్రస్థాయిలో అధికారులు ఎస్సీ, ఎస్టీల సమస్యల పరిష్కారంలో అలసత్వం వహించకుండా చిత్తశుద్ధితో పరిష్కరించాలని పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ అన్నారు. గోకులం (ఆవుల షెడ్లు) షెడ్లు మంజూరు చేయాలని కలెక్టర్‌ను కోరగా 350 షెడ్లు మంజూరు చేశారన్నారు. జిల్లా స్థాయిలో జరిగే ప్రజా ఫిర్యాదుల విభాగంలో అందే సమస్యలను జిల్లా నిఘా, పర్యవేక్షణ కమిటీలో నమోదు చేయాలన్నారు. ఎస్పీ మణికంఠ మాట్లాడుతూ ఎస్సీ ఎస్టీ వర్గాల కేసులు పురోగతిపై ప్రత్యేక దృష్టి పెట్టి పరిష్కరిస్తున్నామన్నారు. 2024 జనవరి 1 నుంచి ఆగస్టు 20 వరకు జిల్లాలో ఎస్సీ, ఎస్టీలకు సంబంధించి 58 కేసులు నమోదు కాగా, అందులో 42 కేసులు ఇన్వెస్టిగేషన్‌లో ఉన్నాయన్నారు. 7 తప్పుడు కేసులు, 9 కేసులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. 45 మందికి రూ.25.90 లక్షల పరిహారం అందజేసినట్లు చెప్పారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ విద్యాధరి, డీఆర్‌ఓ పుల్లయ్య, సాంఘిక సంక్షేమ శాఖ డీడీ రాజ్యలక్ష్మీ, చిత్తూరు, పలమనేరు, కుప్పం, నగిరి ఆర్డీఓలు చిన్నయ్య, మనోజ్ కుమార్ రెడ్డి, శ్రీనివాస్ రాజు, వెంకట్రామి రెడ్డి, హౌసింగ్ పీడీ పద్మనాభం, గిరిజన సంక్షేమ శాఖ అధికారి ఎస్.మూర్తి, చిత్తూరు తహసీల్దార్ కళావతి, వివిధ శాఖల జిల్లా అధికారులు, కమిటీ సభ్యులు, రాజ్ కుమార్, దేవరాజులు, బాబు, డేవిడ్, యల్లప్ప నాయకులు పాల్గొన్నారు.

పట్టుబడిన మద్యం ధ్వంసం



మద్యం సీసాలను ధ్వంసం చేస్తున్న జేసీబీ

కార్వేటినగరం: అక్రమంగా రవాణా చేస్తూ పట్టుబడిన మద్యాన్ని జేసీబీ యంత్రంతో బుధవారం కుమారగిరి సమీపంలో ధ్వంసం చేసినట్లు ఎస్‌ఈబీ సూపరింటెండెంట్ శ్రీధర్‌రావు తెలిపారు. ఆయన మాట్లాడుతూ కార్వేటినగరం సర్కిల్ పరిధిలోని పాలసముద్రం మండలంలో పట్టుబడిన 390 లీటర్ల నాటు సారా, ఎన్‌డీపీఎల్ మద్యం 17 లీటర్లు, శ్రీరంగరాజపురం పోలీస్టేషన్ పరిధిలో 7 కేసుల్లో 130 లీటర్ల సారాను ధ్వంసం చేసినట్లు తెలిపారు. కార్వేటినగరం పోలీస్ స్టేషన్ పరిధిలో 264 మద్యం బాటిళ్లను జేసీబీ యంత్రం ద్వారా తొక్కించి, కాల్చివేశారన్నారు. తమిళనాడు, కర్ణాటక నుంచి అక్రమంగా తరలిస్తున్న వారిపై కేసులు నమోదు చేశామని చెప్పారు.

పవిత్రమైన ప్రాంతంలో మద్యం ధ్వంసం

భక్తులు అత్యంత పవిత్రంగా భావించే సుబ్రమణ్యస్వామి వెలసి ఉన్న కుమారగిరి సమీపంలో పోలీస్ అధికారులు, ఎక్సైజ్ అధికారులు మద్యం బాటిళ్లను ధ్వంసం చేసి అపవిత్రంగా మారుస్తున్నారని స్థానికుల నుంచి విమర్శలు మొదలయ్యాయి. కుమారగిరికి నలుమూలల నుంచి భక్తులు అధిక సంఖ్యలో వస్తుంటారు. దీనికి కూత వేటు దూరంలో బాలుర వసతి గృహం ఉంది. అలాంటి చోట మద్యం ధ్వంసం చేయడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. కార్వేటినగరం గ్రామానికి చెందిన రైతులు పొలాలకు వెళ్లే దారిలో మద్యాన్ని ధ్వంసం చేయడం వల్ల సీసా పెంకులు రైతుల కాళ్లకు గుచ్చుకుని గాయపడుతున్నారని స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు నగరానికి దూరంగా అటవీ ప్రాంతంలో

ఆర్‌ఎంపీలు మాయం

సాక్షి ఎఫెక్ట్..

పలమనేరు: జిల్లాలోని పలు చోట్ల ఆర్‌ఎంపీలు బుధవారం కనిపించకుండా పోయారు. కొన్ని కేంద్రాలు మూతబడ్డాయి. కొందరు ఆర్‌ఎంపీలు మాత్రం తమను ఎవరూ టచ్ చేయలేరంటూ యథావిధిగా నిబంధనలకు విరుద్ధంగా సేవలందించారు. ఆర్‌ఎంపీ వైద్యం తీస్తోంది ప్రాణం అనే శీర్షికన బుధవారం 'సాక్షి'లో వెలువడిన కథనంపై జిల్లాలోని అక్రమ ఆర్‌ఎంపీలు ఉలిక్కిపడ్డారు. దీనిపై డీఎంహెచ్‌ఓ ప్రభావతిదేవి ఆదేశాలతో ఆయా మండలాల మెడికల్ ఆఫీసర్లు అక్కడి పీఎంపీలపై నిఘా పెట్టారు. దీన్ని గమనించిన ఆర్‌ఎంపీలు బుధవారం కేంద్రాలను తెరవకుండా జాగ్రత్త పడ్డారు. మరోవైపు ఆర్‌ఎంపీ సంఘాల ఆదేశాలతో వీరు అప్రమత్తంగా గడిపారు. కానీ పలమనేరులోని దిల్షాద్, నవీన్ లాంటి సీనియర్లు మాత్రం తాము ఎవరికీ బెదిరేది లేదంటూ యథావిధిగా రోగులకు వైద్యం చేశారు. మరోవైపు ఆర్‌ఎంపీలకు తప్పుడు అనుభవ సర్టిఫికెట్లను జారీ చేసి ఈ వ్యవస్థను ప్రోత్సహిస్తున్న ఆర్‌ఎంపీ యూనియన్ నేతలపై జిల్లా వైద్యశాఖ ప్రత్యేక నిఘాను పెట్టినట్టు తెలిసింది.

ప్రణాళిక ప్రకారం సమస్యల పరిష్కారం

- బాధ్యతలు స్వీకరించిన జాయింట్ కలెక్టర్ విద్యాధరి



నూతన జేసీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న డీఆర్‌ఓ పుల్లయ్య

చిత్తూరు కలెక్టరేట్ : ప్రణాళిక ప్రకారం రెవెన్యూ సమస్యలను పరిష్కరిస్తానని నూతన జాయింట్ కలెక్టర్ విద్యాధరి అన్నారు. ఆమె బుధవారం ఉదయం 9.30 గంటలకు కలెక్టరేట్‌లోని జేసీ చాంబర్‌లో బాధ్యతలు స్వీకరించారు. మొదట కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఏళ్ల తరబడి పరిష్కారానికి నోచుకోని రెవెన్యూ సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువ చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. రెవెన్యూ అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది బాధ్యతతో విధులు నిర్వర్తించాలన్నారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన జేసీని డీఆర్‌ఓ పుల్లయ్య, ఏఓ కులశేఖర్, కలెక్టరేట్ సూపరింటెండెంట్‌లు, ఇతర శాఖల జిల్లా అధికారులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ సిబ్బంది శివకుమార్, మనోజ్‌రెడ్డి, హేమాద్రి, రూపేష్, పురుషోత్తం పాల్గొన్నారు.

ఐదు పాఠశాలలకు క్రీడా ప్రతిభా అవార్డులు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని ఐదు ప్రభుత్వ పాఠశాలలు క్రీడా ప్రతిభా అవార్డులకు ఎంపికైనట్లు జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ సెక్రటరీ వసంతవాణి తెలిపారు. ఈ మేరకు ఆమె బుధవారం విలేకరులతో మాట్లాడుతూ జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని క్రీడా ప్రతిభా అవార్డులకు 5 పాఠశాలలను కమిటీ ఎంపిక చేసిందన్నారు. ఐరాల ప్రభుత్వ ఉన్నత పాఠశాల, పూతలపట్టు, బంగారుపాళెం మండలం ఎగువరాగిమానుపెంట, యాదమరి, పుంగనూరు మండలం పుదిపట్ల జెడ్పీ హైస్కూళ్లు అవార్డులకు ఎంపికయ్యాయన్నారు. ఎంపికైన పాఠశాలల హెచ్‌ఎం, పీడీలకు గురువారం జిల్లా కేంద్రంలోని మెసానికల్ మైదానంలో నిర్వహించే క్రీడా దినోత్సవం కార్యక్రమంలో అవార్డులు అందజేయనున్నట్లు వెల్లడించారు.

సరికొత్తగా భారతి అల్ట్రా ఫాస్ట్ సిమెంట్



చౌడేపల్లెలో మేస్త్రీలకు ప్రమాద బీమా సర్టిఫికెట్లు అందజేస్తున్న మేనేజరు ఛాయాపతి

చౌడేపల్లె: అత్యాధునిక టెక్నాలజీతో సరికొత్త రీతిలో భారతి అల్ట్రా ఫాస్ట్ సిమెంట్ తయారవుతోందని ఆ సంస్థ టెక్నికల్ మేనేజర్ ఛాయాపతి అన్నారు. భారతి సిమెంట్ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక శ్రీసాయి యశ్వంత్ ట్రేడర్స్ కేంద్రంలో తాపీ మేస్త్రీలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మార్కెట్‌లో లభించే ఇతర సిమెంట్లతో పోలిస్తే అత్యాధునిక టెక్నాలజీతో తయారవుతున్న భారతి అల్ట్రా ఫాస్ట్ సిమెంట్‌తో నిర్మాణ ప్రక్రియ వేగవంతం అవుతుందని చెప్పారు. అతి తక్కువ సమయంలో సెట్టింగ్ పూర్తవుతుందని వివరించారు. తాపీ మేస్త్రీలకు రూ.లక్ష విలువచేసే ప్రమాద బీమా సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో భారతి సిమెంట్ మార్కెటింగ్ మేనేజర్ వెంకట్రామిరెడ్డి, సాయియశ్వంత్ ట్రేడర్స్ డీలర్ కుమార్ పాల్గొన్నారు.

అక్రమాలు రూ.24 లక్షలు.. రికవరీ రూ.94వేలు



సోషల్ ఆడిట్ చేస్తున్న అధికారులు

పలమనేరు: మండలంలో గతంలో జరిగిన ఉపాధి పనులకు సంబంధించిన 18వ విడత సోషల్ ఆడిట్ బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో జరిగింది. ఇందులో విచారణ కోసం వచ్చిన అధికారులు కొండను తవ్వి ఎలుకను పట్టిన చందాన కనిపించింది. మండలంలో 1.4.2023 నుంచి 31.3.2024 దాకా జరిగిన పనులకు వారం రోజులుగా మండలంలో తనిఖీలు చేశారు. దీనిపై స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద బహిరంగ సభ నిర్వహించారు. డ్వామా పీడీ రాజశేఖర్, డీఆర్‌డీఏ పింఛన్ల ఇన్‌చార్జి రవికుమార్, విజిలెన్స్ అధికారి భవాని, స్థానిక ఏపీడీ రవికుమార్, ఎంపీడీవో రాజేష్ హాజరయ్యారు. ఉపాధిహామీలో 608 పనులకు సంబధించి 3.38కోట్లు పనులు, పంచాయతీరాజ్‌లో 16 పనులకు రూ.1.04కోట్లు, హౌసింగ్, ఎస్‌ఎస్‌ఏలో జరిగిన మొత్తం రూ.4.44కోట్లతో జరిగిన 639 పనులకు సంబంధించి విచారణ చేశారు. ఇందులో మస్టర్లలో సంతకాలు లేకపోవడం, బినామీ కూలీలు, అసలు పనులే జరక్కపోవడం, మొక్కలు నాటకనే నాటినట్టు బిల్లులు తదితరాలపై మండలంలోని పది పంచాయతీల్లో రూ.24.88లక్షల అక్రమాలు జరిగినట్లు సోషల్ ఆడిట్ ఎస్‌ఆర్పీ బుజ్జి బృందం నివేదిక సమర్పించింది. దీనిపై వారు సామాజిక బహిరంగ విచారణ చేసి, ఇందులో కేవలం రూ.94.94 వేలు బాధ్యుల నుంచి రికవరీ చేయాలని ఆదేశించి వెళ్లారు. ఉపాధి హామీ టెక్నికల్ అసిస్టెంట్లు శ్రీనివాస్‌రెడ్డి, మోహన్‌మురళితోపాటు 8 మంది ఫీల్డ్ అసిస్టెంట్లన్లు విధులనుంచి తప్పించి రూ.15వేల జరిమానా వసూలు చేయాలని అధికారులు ఆదేశించారు. అయితే వీరు ఇప్పటికే విధులకు రాజీనామా చేయడం గమనార్హం.

చిత్తూరులో వ్యక్తి హత్య



హత్యకు గురైన దావూద్

చిత్తూరు అర్బన్: నగరంలో వ్యక్తి హత్యకు గురయ్యారు. బుధవారం తెల్లవారుజామున నగరంలోని ఇందిరానగర్ నుంచి వీరభద్రకాలనీకు వెళ్లే దారిలో ఓ గుర్తు తెలియని వ్యక్తి అపస్మారస్థితిలో పడిఉన్నట్లు పోలీసులకు సమాచారం అందింది. ఘటనా స్థలాన్ని వెళ్లి పరిశీలించగా తలపై బండరాయితో కొట్టి హత్య చేసినట్లు పోలీసులు గుర్తించారు. దీనిపై పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. మృతుడు బంగారుపాళ్యంకు చెందిన దావూద్ బాషా(27)గా గుర్తించారు. ఆర్థిక లావాదేవీల కారణంగా బంగారుపాళ్యం నుంచి తీసుకొచ్చి చిత్తూరులో హత్య చేసినట్లు ప్రాథమికంగా తేల్చారు. హత్యకు పాల్పడ్డట్లు అనుమానిస్తున్న ఇద్దరు నిందితులను తిరుపతిలో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మరో నిందితుడు కృష్ణగిరికి పారిపోగా, అతడి కోసం పోలీసులు గాలిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

పేకాడుతున్న 8 మంది అరెస్టు

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలో పేకాట ఆడుతున్న ఎనిమిది మంది నిందితులను వన్‌టౌన్ పోలీసులు అరెస్టు చేశారు. నగర శివారుల్లోని ఎస్టేట్ ప్రాంతంలో పేకాట ఆడుతున్నట్లు పోలీసులకు సమాచారం రావడంతో, వన్‌టౌన్ పోలీసులు దాడులు చేశారు. పేకాడుతున్న ఎనిమిది మందిని అరెస్టు చేసి, వారి నుంచి రూ.71,890 నగదును స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

జెడ్పీలో తుది దశకు కసరత్తు

చిత్తూరు కార్పొరేషన్: జెడ్పీ పరిధిలో బదిలీలకు వచ్చిన దరఖాస్తులను సీఈవో గ్లోరియా పర్యవేక్షణలో అధికారులు పరిశీలిస్తున్నారు. రెండు రోజుల్లో బదిలీ ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశాలు ఉన్నాయి. రెండు రోజులుగా జెడ్పీ కార్యాలయంలో బదిలీల దరఖాస్తులను పరిశీలించే పనిలో అధికారులు ఉన్నారు. ఒకే చోట ఐదేళ్ల సర్వీస్ పూర్తి చేసినవారు, రిక్వెస్టు దరఖాస్తులు విడివిడిగా చూస్తున్నారు. ఎంపీడీఓలు, ఏఓలు, సీనియర్, జూనియర్ సహాయకులు, టైపిస్టు, రికార్డు, ఆఫీసు సబార్డినేటర్లు కేడర్లు వారీగా పరిశీలించగా అందులో ఎంపీడీవోలు, ఏవోల బదిలీలకు సంబంధించి తుది జాబితా సిద్ధమైందని తెలుస్తోంది. మిగిలిన కేడర్లను రెండు రోజుల్లో పూర్తి చేసి బదిలీ ఉత్తర్వులు ఇవ్వనున్నారు. బదిలీల్లో యూనియన్ల నాయకులకు మినహాయింపు ఇవ్వాలని సీఈవోను నాయకులు కలిసి విజ్ఞప్తి చేశారు. సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాలని ఆమె సూచించారు.

ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడిగా లోకనాథం



చిత్తూరు రూరల్: ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ (ఏపీయూడబ్ల్యూజే) చిత్తూరు జిల్లా అధ్యక్షుడిగా సీనియర్ జర్నలిస్టు ఎం.లోకనాథం ఎన్నికయ్యారు. చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో బుధవారం జరిగిన జిల్లా ఎన్నికల్లో అధ్యక్షుడిగా ఎం.లోకనాథం (చిత్తూరు), ఉపాధ్యక్షులుగా ఎస్.శివకుమార్ (చిత్తూరు), కోటేశ్వర యాదవ్ (పలమనేరు), మురహరిరెడ్డి (పూతలపట్టు), ప్రధాన కార్యదర్శిగా బి.మురళీకృష్ణ (చిత్తూరు), కార్యనిర్వాహక కార్యదర్శిగా కెఎం.అశోక్‌కుమార్ (చిత్తూరు), కోశాధికారిగా వాలప్ప (పుంగనూరు), సహాయ కార్యదర్శులుగా ఇషార్ అహ్మద్ (చిత్తూరు), వెంకటాచలం(కుప్పం), చంద్రమోహన్ (నగరి), కార్యనిర్వాహక కమిటీ సభ్యులుగా గోవిందస్వామి (వెదురుకుప్పం), కె.రమేష్ (గంగాధరనెల్లూరు), జగన్నాథం (తవణంపల్లె), ఎల్ఎస్.ఖాన్(వి.కోట), సురేష్ (చిత్తూరు), సుబ్రమణ్యం (నగరి), సుధాకర్‌నాయుడు (చిత్తూరు), డి.ఉదయ్‌రెడ్డి (కుప్పం), జయకర్ (చిత్తూరు), బి.జీవన్‌కుమార్ రెడ్డి (పూతలపట్టు), సుబ్రమణ్యం (పలమనేరు), వెంకటేశ్వర్లు (ఎస్.ఆర్.పురం) ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి కృష్ణయ్య, సుభాష్‌బాబు, ఎన్నికల పరిశీలకులు డాక్టర్ ఎం.ప్రసాద్ ప్రకటించారు.

డ్రాపౌట్స్‌కు వరం ఓపెన్ స్కూల్



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న అధికారులు, సిబ్బంది

చిత్తూరు కలెక్టరేట్ : అనివార్య కారణాల వల్ల చదువు మధ్యలో మానేసిన వారికి ఓపెన్ స్కూల్ విధానం వరంలాంటిదని రాష్ట్ర ఓపెన్ స్కూల్ కో–ఆర్డినేటర్ రవీంద్రనాయుడు అన్నారు. జిల్లా కేంద్రంలోని పీసీఆర్ ప్రభుత్వ పాఠశాలలో బుధవారం ఓపెన్ స్కూల్ ఉపయోగాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. రాష్ట్ర కో–ఆర్డినేటర్ మాట్లాడుతూ రెగ్యులర్‌గా చదువు కొనసాగించలేని వారు ఓపెన్ స్కూల్ విధానంలో పది, ఇంటర్ కోర్సులు పూర్తి చేయవచ్చన్నారు. ఓపెన్ స్కూల్ విధానంలో పొందే పది, ఇంటర్మీడియట్ సర్టిఫికెట్లతో ఎలాంటి ప్రభుత్వ ఉద్యోగాలైనా పొందవచ్చన్నారు. ఏపీ ఓపెన్ స్కూల్ విధానంపై ఏఐ కో–ఆర్డినేటర్లు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలని తెలిపారు. డీఈఓ దేవరాజు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ప్రస్తుత విద్యాసంవత్సరంలో ఓపెన్ స్కూల్ అడ్మిషన్ల పెంపుపై దృష్టి వహించాలన్నారు. అనంతరం అవగాహన ర్యాలీ నిర్వహించి పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో జిల్లా కో–ఆర్డినేటర్ వెంకటేశ్వరరావు, ఎంఈఓలు సెల్వరాజ్, మోహన్, ఏఐ కో–ఆర్డినేటర్లు తులసిబాబు, పూర్వాణి, హేమాద్రి తదితరులు పాల్గొన్నారు.